క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షాద్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్టుమెంట్ వారు అర్హులైన విద్యార్థుల నుంచి జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు గడువు విధించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఉన్న ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

మాజీ వైస్ ఎంపీపీ పాండునాయక్

నందిగామ: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారని బీజేపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి మండలాల మాజీ వైస్ ఎంపీపీ పాండునాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం తీసుకోలేని కఠిన నిర్ణయాలు ప్రస్తుత ప్రధాని తీసుకొని దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాడన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీదే అని గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మన రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చేనెల 4వ తేదీన అత్యధిక మెజార్టీ సీట్లతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, మళ్లీ నరేంద్ర మోదీ ప్రధాని అవుతారన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌదరిగూడ మండల పరిధిలోని రావిరాల గ్రామంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలన్నారు. భగవన్నామస్మరణతో ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, శేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ్యూల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సామ్యూల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్యూల్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, యాదయ్య, రాములుగౌడ్, పాపయ్య, నర్సింలు, రవి, ప్రవీణ్, రమేశ్, అశోక్, శ్రీను, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో రుక్మిణీ సహిత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, కొంతం వెంకట్‌రెడ్డి, సామ భీంరెడ్డి, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

మైసిగండి ఆలయంలో పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ఆలయంలో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాధవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, కేశవులు, జంగయ్య, భూపతిరెడ్డి, బీచ్యానాయక్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- భూసార పరిరక్షణకు ఎంతో మేలు
- పెరగనున్న పంటల దిగుబడి
- సబ్సిడీపై అందుబాటులో విత్తనాలు



రైతులకు జనుము విత్తనాల పంపిణీ(ఫైల్)

షాబాద్: అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు పంట సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడంతో అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతున్నది. సూక్ష్మపోషక లోపాలు తరచుగా కనబడుతాయి. ఉత్పత్తి కూడా తగ్గి ఖర్చు పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో నేల సహజత్వాన్ని కాపాడుతూ అధిక దిగుబడులను సాధించేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతగానో దోహదపడుతాయి. పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లి అవి పెరిగిన తర్వాత అదే పొలంలో కలియదున్ని పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ విత్తనాలను జూన్ లేదా తొలకరి వర్షాలు ప్రారంభమైనప్పుడు పొలంలో చల్లుకోవాలి. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర వంటి వాటిని మొగ్గ దశ వరకు పెంచి పొలంలోనే కలియదున్ని పచ్చిరొట్ట ఎరువుగా పంటలకు వినియోగించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా ఇవి పూత దశకు రావడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. జీలుగ, జనుము విత్తనాలను రైతులకు రాయితీపై అందించి సాగు పెంపునకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు. వరి పంటకు జనుమును పచ్చిరొట్ట ఎరువుగా వాడటంతో గడ్డి పెరుగదని, నత్రజని ఎరువులు తగ్గడంతో పాటు దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగు చేసి ప్రయోజనాలు పొందాలని చెబుతున్నారు.

ప్రయోజనాలివీ..

పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియతో భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయి. నేల భౌతిక లక్షణాలు వృద్ధి చెంది నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుంది. నీటినిల్వ సామర్థ్యం పెరిగి నేల కోతను అరికడుతుంది. మొక్కల వేర్లకు అవసరమయ్యే గాలి, నీరు పుష్కలంగా అందుతాయి. పండ్ల తోటల్లో పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి పూత దశలో కలియదున్నితే నేల సారవంతమవుతుంది. దీంతో భూసారం పెరుగుతుంది. వరిపంట సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడంతో బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరుగుతుంది.

సబ్సిడీపై విత్తనాలు..

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి భూమిలో సారాన్ని పెంచేందుకు ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై సరఫరా చేస్తోంది. షాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా పచ్చిరొట్ట ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. 40 క్వింటాళ్ల జనుములు, 26 క్వింటాళ్ల జీలుగ అందుబాటులో ఉన్నాయి. కాగా జీలుగ బస్తాకు రూ.1,116, జనుములు బస్తాకు రూ.1448 చెల్లించి రైతులు విత్తనాలు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను ఇవ్వాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకొని సేంద్రియ పంటల సాగుకు శ్రీకారం చుట్టాలని పేర్కొంటున్నారు.

దిగుబడి పెంచేందుకే..



పొలాల్లో భూసారాన్ని పెంచి తద్వారా అధిక దిగుబడులను సాధించేందుకు పచ్చిరొట్ట పైర్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. నీటి సౌకర్యం ఉన్న ఏ పొలంలోనైనా పచ్చిరొట్ట విత్తనాలను చల్లి అవి పెరిగిన తరువాత వాటిలోనే కలియదున్ని అన్ని పంటలకు ఎరువుగా వాడుకోవచ్చు. వీటిని ఎరువుగా వాడటం ద్వారా పంటలకు మేలుచేసే క్రిమికీటకాలు, వానపాములు వృద్ధి చెందుతాయి. దీంతో పంటలు ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. ఖర్చు సైతం తగ్గుతుంది. రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగును చేసుకోవాలి. -వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి, షాబాద్

పోరాట యోధుడు సుందరయ్య

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మొయినాబాద్: పేదల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా దళితుల పక్షాన నిలిచి పోరాటాలు చేశారన్నారు. విద్యార్థి, యువజన, రైతులు, మహిళలు, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని, సుందరయ్య సిద్ధాంతాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయ సాధన కోసం ఎర్రజెండా నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, నాయకులు అశోక్, శ్రీనివాస్, వెంకటయ్య, అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీతా జ్ఞానమే త్రైత సిద్ధాంతం

ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా సభ్యుడు నాగ్యానాయక్



త్రైత సిద్ధాంతంపై ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

షాద్‌నగర్: మాధవుడు ప్రబోధించిన గీతా జ్ఞానమే త్రైత సిద్ధాంతమని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక మహబూబ్‌నగర్ కమిటీ జిల్లా సభ్యుడు నాగ్యానాయక్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ గ్రామాల్లో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ్యానాయక్ మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ, అను మూడు ఆత్మల గురించి తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందన్నారు. ఇదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు శ్రీనివాసులు, కిషోర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, తిరుపతయ్య, కృష్ణయ్య, బుచ్చిలింగం, యాదయ్య, శ్రీనివాసులు, సావిత్రమ్మ, ఉదయ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–2005లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరికొకరూ పరిచయం చేసుకొని చిన్ననాటి తీపి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటాపాటలతో సరదాగా గడిపారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులు ప్రతాప్‌రెడ్డి, బసీర్ అహ్మద్, నాగేశ్వర్‌రావు, వరలక్ష్మి, మంజుల, పద్మ, లతను శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురిసిన చిరుజల్లులు



అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం ఆయా గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, ముర్తుజాగూడ, బాకారం, కనకమామిడి, తోల్‌కట్ట, ఎన్కెపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, నదీమ్‌నగర్, కాశింబౌలి, చిన్నమంగళారం, టోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి, ఆయా గ్రామాల్లో సాయంత్రం వేళ చిరుజల్లులతో వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు



నందిగామ: ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. ఒగ్గు కళాకారుల ఆటాపాటలతో మండల పరిధిలోని వెంకమ్మగూడలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కళాకారుల ఆటాపాటలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య గ్రామస్తులు పెద్దఎత్తున బోనాల ఊరేగింపుతో దేవాలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, తాజా మాజీ సర్పంచ్ రజనీత వీరేందర్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్, గ్రామస్తులు మధు, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపల్లి గ్రామంలో..

చేవెళ్ల: మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపుగా కనుల పండువగా సాగింది. గ్రామ పెద్దలందరూ ఉత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని పలు పార్టీల నాయకులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు. వారిని గ్రామస్తులు సన్మానించారు.



నందిగామ: బోనాల ఊరేగింపు



చేవెళ్ల: ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఒగ్గు పూజారులు

మలుపులు.. మృత్యుమార్గాలు



బాకారం సమీపంలో ప్రమాదకరంగా మలుపు



ఎన్కేపల్లి సమీపంలో సూచికబోర్డు లేని మలుపు

- ప్రమాదకరంగా రహదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్

మొయినాబాద్ రూరల్: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులతో పాటు గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారులపై ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి నుంచి బాకారం, తోలుకట్ట నుంచి ఎత్‌బార్‌పల్లి, అమ్డాపూర్ నుంచి కాశింబౌలి, అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ, బాకారం, హిమాయత్‌నగర్ నుంచి చిల్కూర్, పెద్దమంగళారం నుంచి ఎల్కాగూడ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బాకారం ఎన్కేపల్లి, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాహనాదారులు, బైక్‌లు, ఆటోలు అధికంగా రాకపోకలు సాగిస్తారు. మలుపుల వద్ద ముళ్ల పొదలు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులకు దాదాపు 10 నుంచి 15 మూలమలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలిగించి, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల పొదలు తొలిగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల ముళ్ల పొదలు పెరిగాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకిరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించి, మరమ్మతులు చేయించాలి. -మహేందర్‌ముదిరాజ్, బాకారం

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులలో అధిక మూలమలుపులు ఉన్నాయి. అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ, బాకారం వెళ్లే రహదారికి అధిక మూలమలుపులు ఉన్నాయి. పలుచోట్ల ముళ్ల పొదలు రోడ్ల పైకి వచ్చాయి. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలిగించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. - కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. చేవెళ్లలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అడ్మిషన్లకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 20వ తేదీవరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీల కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేవెళ్లలో నూతన డిగ్రీ కళాశాల భవనంతో పాటు నైపుణ్యం గల అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీలో కోర్సుల కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంఘం నిర్మాణానికి విరాళం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న విశ్వకర్మల సంఘం భవన నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ మోటి శ్రీశైలం రూ.20వేల విరాళం అందజేశాడు. గ్రామంలో ఆదివారం విశ్వకర్మల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీశైలం విరాళం అందజేశారు. గ్రామంలో దాతలు ముందుకు వచ్చి భవన నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నల్లోల చంద్రయ్య, గోదాసు నర్సింహ, శ్రీను, బేత జంగయ్య, సంగెం మల్లేశ్, రవి, మల్లేశ్, విశ్వకర్మల సంఘం నాయకులు ప్రకాష్‌చారి, శ్రీనువాస్‌చారి, రవి చారి, అంజయ్య చారి, బాలచారి తదితరులు పాల్గొన్నారు.